క్లుప్తంగా

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కలపాటి దేవదానమ్మ, రాజరత్నంకు సన్మానం

ఓజిలి : మండల కేంద్రమైన ఓజిలిలో ఉన్న సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ రాజరత్నం, వాకాడుకు చెందిన సిస్టర్ కలపాటి దేవదానమ్మ దేవుడి వాక్యాలను పరిచయం చేశారు. క్రీస్తు పాపులను రక్షించడానికి శిలువపై మరణం పొందాడని, తిరిగి బతికాడని తెలిపారు. సిస్టర్ కలపాటి దేవదానమ్మ, రాజరత్నంను మహిళా సమాజ సభ్యులు ఘనంగా సత్కరంచారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

రాపూరు/సైదాపురం: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని పంటలు సాగు చేసుకోవాలని ఏవోలు సోమసుందర్, హైమావతి తెలిపారు. రాపూరు, సైదాపురం మండలాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే ఖర్చులు తగ్గుతాయని, అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. అనంతరం మిరప పంటలను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న దినేష్‌రెడ్డి

రాపూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి రాపూరు మండలం బొజ్జనపల్లి పంచాయతీలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో వ్యర్థాలను రీసైకిల్ చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని కొంతవరకు తగ్గించవచ్చన్నారు. అనంతరం పరిశ్రమలో మొక్కలు నాటారు. పొల్యూషన్ కంట్రోల్ అధికారులు అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, రమణయ్య, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

నాయుడుపేట టౌన్ : విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) పోరాటాలు చేస్తోందని నాయకులు తెలిపారు. సంఘం ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాయుడుపేటలో బుధవారం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సంఘం జిల్లా కార్యదర్శి లోకేష్ విద్యార్థులతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలు, ఉన్నత పాఠశాలలకు పండ్ల మొక్కలు పంపిణీ చేశారు.

వేలంలో పంచాయతీకి రూ.2.80 లక్షల ఆదాయం

సైదాపురం: మండలంలోని లింగనపాళెం చెరువులో చేపలు పెంచుకునేందుకు నిర్వహించిన వేలం ద్వారా పంచాయతీకి రూ.2.80 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవోపీఆర్డీ జిలానీ బాషా తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం చెరువుకు వేలం పాటలు నిర్వహించినట్టు తెలిపారు. చెరువును దక్కించుకున్న వారు ఏడాదిపాటు చేపలు పెంచుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసరాజు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం అలిమిలి గ్రామంలోని అంగన్‌వాడీ-1, 2 సెంటర్లను ఎంపీడీవో వినీల్, ఈవోపీఆర్డీ మోహన్‌రాజు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశించారు.

కాలువలో పైపుల తొలగింపు



చిల్లకూరు : మండలంలోని చింతవరం సమీపంలో ఉన్న బల్లవోలు కాలువలో నీటి పారుదలకు అడ్డుగా ఉన్న పైపులను బుధవారం సాగరమాల రోడ్డు కాంట్రాక్టర్లు తొలగించారు. బల్లవోలు, వేళ్లపాళెం, కోరావారిపాళెం రైతులు మాట్లాడుతూ ఎగువ ప్రాంతం, సిలికా గనుల్లో ని సొనకాలువ నుంచి వచ్చే నీటితో సుమారు 400 ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. నీరు ఎక్కువైతే బల్లవోలు కాలువ ద్వారా కండలేరు క్రీక్‌లోని వదులుతున్నట్టు తెలిపారు. కండలేరు క్రీక్ పైన బ్రిడ్జి సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండడంతో కాలువకు అడ్డంగా పెద్ద పైపులు వేశారని తెలిపారు. ఈ క్రమంలో నీరు దిగువకు వెళ్లకుండా పంట పొలాల్లోని నిలిచిందన్నారు. ఈ విషయాన్ని మారంరెడ్డి అమరనాథ్‌రెడ్డి, దువ్వూరు చెంచుకిరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పైపులు తొలగించి నీరు దిగువకు వెళ్లేలా చర్యలు చేపట్టారని తెలిపారు.

ఇటీవల ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. కొన్నిచోట్ల చెరువు కట్టలు బలహీనంగా మారడంతో ఇసుక బస్తాలు వేశారు. వాగులు, వంకలు, నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పొలాల్లో నీరు నిలవడంతో పంటలు నాశనం అయ్యాయి. ఇప్పుడు మరోసారి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వర్షాలు కురుస్తాయని అధికారులు వెల్లడించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- అన్నదాతల్లో కలవరం
- నిండుకుండల్లా చెరువులు
- ప్రమాదకరంగా చెరువు కట్టలు
- నీటిలోనే వరినాట్లు

స్వర్ణముఖి చల్లకాలువ ప్రవాహం



మళ్లీ తుపానా..?

కోట : మండలంలో 47 చెరువులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్వర్ణముఖినది, స్వర్ణముఖి చల్లకాలువకు వరద పోటెత్తడంతో చెరువుల్లోకి సామర్థ్యానికి మించి నీరు చేరింది. కలుజులు జోరుగా పారుతున్నాయి. మండలంలో అతి పెద్దదైన పెన్నక్కచెరువుతో పాటు చిన్న, పెద్దా చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. మండలంలో ఎటు చూసినా నీరే కనిపిస్తోంది.

రబీసాగు ప్రారంభం నుంచే వానలు

సాధారణంగా అక్టోబర్ నెలాఖరు, నవంబర్ నెలలో రబీ సాగు ప్రారంభం అవుతుంది. ఈ సీజన్‌లో కోట మండలంలో ఏడు వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తారు. ఈ ఏడాది నవంబర్ వరకు వర్షపు జాడ లేదు. బోరుబావుల్లో నీరు ఉన్న రైతులు కొంతమంది వరినార్లు పోసుకుని పొలాలను దుక్కిదున్నారు. మరికొందరు రైతులు వర్షం కురుస్తుందన్న ఆశతో పొలాలను దుక్కిదున్నకం



పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి నది పొర్లు కట్టను పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

పనులు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ చివర, డిసెంబర్ మొదటి వారంలో రెండు తుపానుల ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. కోట మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. రైతులు ఆనందంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



అల్లంపాడులో పొలాల్లోని నీటిని మోటార్లతో బయటకు తోడేస్తున్న రైతులు

తాజాగా మరోమారు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ వర్షం కురిస్తే చెరువు కట్టలు తెగిపోతాయని వాపోతున్నారు.

ప్రమాదపుటంచున చెరువు కట్టలు

భారీవర్షాలకు తోడు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో మండలంలోని 47 చెరువుల్లోకి సామర్థ్యానికి మించి నీరు చేరింది. కలుజులు ఉద్ధృతంగా పారుతున్నాయి. వంజివాక, ఉత్తమనెల్లూరు, కొక్కుపాడు, పుచ్చలపల్లి, ఊనుగుంటపాళెం చెరువు కట్టలు ప్రమాదకరంగా మారాయి. కొన్ని చెరువు కట్టలపై రైతులు ఇసుక బస్తాలు వేశారు. మండలంలోని కర్లపూడి, పుచ్చలపల్లి, రుద్రవరంలో స్వర్ణముఖి పొర్లు కట్టలు బలహీనంగా మారాయి. వరదనీటి ఉద్ధృతి పెరిగితే కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్లంపాడు చెరువు కలుజు నీటి ప్రవాహం పెరగడంతో ఆయకట్టు కింద ఉన్న 350 ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. తుపాను ప్రభావంతో మరోసారి వర్షాలు కురిస్తే ముప్పుతప్పదని రైతులు వాపోతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పుచ్చలపల్లి వద్ద ఉన్న స్వర్ణముఖి పొర్లు కట్టలను పరిశీలించి రైతులు, స్థానికులకు పలు సూచనలు చేశారు. జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

దొరవారిసత్రంలో వర్షం

దొరవారిసత్రం : తుపాను ప్రభావంతో మండలంలో బుధవారం వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరిపంట పొట్ట, ఎన్ను దశలో ఉంది. ఈ వర్షానికి పంటకు తీవ్ర నష్టం కలుగుతుందని వాపోతున్నారు. నిన్నమొన్నటి వరకు కురిసిన వర్షాలకే పొలాల్లో నిలిచిన వర్షపు నీరు తగ్గలేదని, మరోసారి అల్పపీడన ద్రోణి కారణంగా వర్షం కురవడం వల్ల పంటలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తల్లంపాడు, లింగంపాడు, వేణుంబాకం, ఏకొల్లు, నెలబల్లి, మీజూరు, వేలికాడు, నాగినేరి, కారికాడు, కట్టువాపల్లి, పూలతోట, కొత్తపల్లి, కల్లూరు తదితర గ్రామాల్లో వరి పంట ఎన్ను తీసింది. ఇప్పుడు కురుస్తున్న వానలకు పంట మొత్తం దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు.



అల్లంపాడు చెరువు కలుజు వద్ద ఇసుక బస్తాలు వేసిన రైతులు



నిండుగా ఉన్న అల్లంపాడు చెరువు



నీటితో కళకళలాడుతున్న వంజివాక చెరువు

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



చిల్లకూరు : అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలు నివారించడంతోపాటు ప్రాణ, ధననష్టాన్ని అరికట్టవచ్చని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జె.రమణయ్య తెలిపారు. ఆయన బుధవారం గూడూరులోని అగ్నిమాపక కేంద్రాన్ని తనిఖీ చేశారు. వాహనాల పనితీరు, సిబ్బంది ఫిట్‌నెస్ తదితరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు వచ్చిన సమయంలో ప్రజలను ఆదుకునేందుకు గూడూరు, కోట, వాకాడు, నాయుడుపేట ప్రాంతాల్లో 5 బోట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరిశ్రమ యాజమాన్యాలు సీఎస్ఆర్ పథకం కింద యంత్రాలను అందిస్తే ప్రమాదాలను త్వరగా అరికట్టవచ్చన్నారు. మరోసారి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు వెల్లడించారు. అనంతరం వర్షాల సమయంలో విద్యుత్ సౌకర్యం లేనప్పుడు వెలిగించే ఆస్కాలైట్‌ను పరిశీలించారు. గూడూరు అగ్నిమాపక శాఖాధికారి డీ విజయకుమార్, సిబ్బంది ఉన్నారు.

పెన్షనర్స్ సమస్యలపై పోరాటాలు

కోట : మండలంలోని పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక షాదీ మంజిల్‌లో బుధవారం పెన్షనర్స్ అసోసియేషన్ వార్షిక సమావేశం నిర్వహించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో పెన్షనర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భోగేశ్వరరావు, వెంకటాచలం, జమ్మి ప్రసాద్‌రెడ్డి, మహ్మద్‌ఖాసిం పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి గాలులు

చిల్లకూరు : వాతావరణంలో నెలకొన్న మార్పులకు తోడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. దీంతో మండలంలోని తీవ్ర ప్రాంతాల ప్రజలు చలికి వణుకుతున్నారు. బుధవారం ఉదయం నుంచి మబ్బులు పట్టడంతో పాటు చిరు జల్లులు కురుస్తున్నాయి. విపరీతమైన చలి గాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్న పిల్లలు బయటకు రావడానికి భయపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయట తిరగాలని, చలికోట్లు ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడి పదార్థాలు తినాలన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

రాపూరు : ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు రోడ్డులో నడిచే బస్సుల్లో ఏర్పాటుచేసిన టికెట్లను లక్కీడిప్ తీసి విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రతేకంగా బస్సులు నడుపుతున్నామని తెలిపారు. విద్యార్థులతోపాటు తల్లితండ్రులు కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ ఆదాయాన్ని పెంచాలన్నారు. రాపూరు -గూడూ రు, రాపూరు-వెంకటగిరి రోడ్లలో ప్రయాణించే వారు బస్సు దిగే సమయంలో తమ టిక్కెట్‌పై ఫోన్ నంబర్, అడ్రస్ రాసి బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీడీప్ ద్వారా నలుగురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ బషీర్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనీల్‌కుమార్

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు

నాయుడుపేట టౌన్ : మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు రూపొందించిన ప్రత్యేక చట్టాలను గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన కల్పించాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. నాయుడుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం సీడీపీవో ఉమామహేశ్వరి అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గృహ హింస, అఘాయిత్యాలు, లైంగిక దాడులు జరిగినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నిందితులపై ఫోక్సో యాక్టు కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా వన్ స్టాఫ్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ రోజారమణి మాట్లాడుతూ బాల్య వివాహాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. చిన్న పిల్లలకు బ్యాడ్, గుడ్ టచ్‌పై తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయుడుపేట, అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ కె.స్వప్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆషాబేగం, సృజన, మణెమ్మ, సాయి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



ఓజిలి : అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి



పెళ్లకూరు : అనకవోలులో రెవెన్యూ సదస్సు

దొరవారిసత్రం : గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నట్టు మండల ప్రత్యేక అధికారి శ్రీధర్ తెలిపారు. మండలంలోని పూలతోటలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతుల వినతులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శైలకుమారి, మండల సర్వేయర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని సగుటూరులో తహసీల్దార్ పద్మావతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కటి వేదికలన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వో దిలీప్‌కుమార్, సాగునీటి సంఘం అధ్యక్షుడు కలపాటి వేణు, నాయకులు ప్రభాకర్‌నాయుడు, బెల్లం రాజా, వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూములను ఇప్పించాలని వినతి

పెళ్లకూరు: మండలంలోని అనకవోలులో భూస్వామి 17 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని, వాటిని స్వాధీనం చేసుకుని తమకు ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. అనకవోలు నిర్వహించిన రెవెన్యూ సదస్సులోతహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో వంశీ పాల్గొన్నారు.

భీమవరం సదస్సులో నాలుగు అర్జీలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని భీమవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 4 అర్జీలు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి, డివిజనల్ సర్వేయర్ హరిహర, తహసీల్దార్ రాజేంద్ర తెలిపారు. వారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంటి స్థలం కోసం ఒకటి, పట్టాదారు పాసు పుస్తకాలకు 3 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్ఐ సాయితేజ, సర్పంచ్ నెలవల అమృత సరళ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండలంలోని తలుపూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

భూమిని స్వాధీనం చేసుకోండి

చిట్టమూరు (చిల్లకూరు) : భూస్వామి చేతిలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని ఆరూరు దళితవాడ వాసులు కోరారు. ఆరూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆరూరు మిట్ట దళితవాడకు సమీపంలో సర్వే నంబర్ 364లోని 2.16 ఎకరాల ప్రభుత్వ భూమిని భూస్వామి ఆక్రమించుకున్నాడని తెలిపారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. నెలలు గడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. దీనిపై డీటీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

చిల్లకూరు : గూడూరు సబ్ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు డీఎస్పీ వీవీ రమణకుమార్ తెలిపారు. ఆయన బుధవారం చిల్లకూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ కేసుల్లో నిందితులను అరెస్టు చేయడంలో డివిజన్‌లోని పోలీసు సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో క్రైం రేటును తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గూడూరు పట్టణం, జాతీయ రహదారి మలుపుల వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి హైవే అథారిటీ అధికారులు, టోల్ వే సిబ్బందితో కలిసి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గూడూరు రూరల్, వాకాడు సీఐలు కిషోర్‌బాబు, హుస్సేన్‌బాషా, చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

దక్కిలి: చదువులో వెనుకబడిని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన బుధవారం దగ్గవోలు ఈస్ట్, మెయిన్ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎస్ఏ-1 పరీక్షలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్థిక సుస్థిరతకు ప్రణాళికలు అవసరం

చిల్లకూరు/దొరవారిసత్రం : పంచాయతీలు ఆర్థికంగా సుస్థిరతను సాధించాలంటే మెరుగైన ప్రణాళికలు అవసరమని రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్, రమేష్ తెలిపారు. వారు బుధవారం చిల్లకూరు, దొరవారిసత్రం ఎంపీడీవో కార్యాలయాల్లో ఆర్థిక సుస్థిరతపై సర్పంచులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంచాయతీల్లో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకుని ఆదాయం పొందేలా పంచాయతీ పాలకులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు, ప్రజల నుంచి వచ్చే సెస్సులను కలుపుకుని ఆర్థిక స్థిరత్వం సాధించాలన్నారు. మహిళా సమాఖ్యలను సంఘటితం చేసి కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ప్రతి కుటుంబానికీ పని లభిస్తుందని, పంచాయతీలకు ఆదాయమూ పెరుగుతుందని వివరించారు. డీఎల్‌పీవో వెంకటరమణ మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేసి అదనపు ఆదాయం పొందాలన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు ఎంపీడీవో గోపి, ఈవోపీఆర్డీ సిరాజ్, దొరవారిసత్రం వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, అధికారులు మునిరాజ, ఉమామహేశ్వరి, జ్యోతిర్మయి, భాస్కరయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దొరవారిసత్రం: మాట్లాడుతున్న రమేష్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నాయుడుపేట టౌన్ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులకు ఇస్తున్న శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అవకతవకలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. ప్రణాళికలు రూపొందించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈవోపీఆర్డీ మల్లు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌తో జపాన్ సంస్థ ఒప్పందం

కోట: విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందించేందుకు సాంకేతిక నైపుణ్య బదలాయింపుపై జపాన్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టు విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జపాన్‌కు చెందిన మెడిన్‌షా సంస్థ ప్రతినిధులు బుధవారం ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో పర్యటించారు. ఈ సందర్భంగా మెడిన్‌షా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కో యమమోటో, డైరెక్టర్ ఉకాయుకి సాన్‌తో సాంకేతిక నైపుణ్య బదలాయింపు ఒప్పందంపై సంతకాలు చేశారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ సంస్థ అయిన మెడిన్‌షా నైపుణ్యాలను ఎన్‌బీకేఆర్ విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఇప్పటికే ఎన్‌బీకేఆర్ విద్యార్థులు 30 మంది అక్కడ ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కో యమమోటో మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషందర్, మెకానికల్ విభాగం హెచ్‌వోడీ విక్రమ్‌కుమార్, కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వినయ్‌సిన్హా పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న జపాన్ సంస్థ, ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ప్రతినిధులు

ఎల్లప్పుడూ అండగా ఉంటాం..

వెంకటగిరి రూరల్/దక్కిలి : వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎళ్లవేలలా అందుబాటులో ఉంటామని, ఎవరూ అధైర్య పడొద్దని ఆ పార్టీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయనను బుధవారం వెంకటగిరిలోని తన నివాసంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. ఆరు నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజల సమస్యల కోసం పోరాటాలు చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పలువురికి పరామర్శ

వెంకటగిరిలోని 9వ వార్డు ఉపాధ్యాయన నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణారెడ్డి మామ ఆదినారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వారి ఇంటికి చేరుకుని ఆదినారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దక్కిలికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోళ్లపూడి వేణుగోపాల్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, పోలేరమ్మ ఆలయ మాజీ చైర్మన్ పులి ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు కందాటికళ్యాణి, వహిదా, యస్దానిబాషా, ఆరి శంకరయ్య, పేనేటి సుబ్బారావు, ఆటం బాకం శ్రీనివాసులు, దక్కిలికి చెందిన చింతల శ్రీనివాసులురెడ్డి, పి.దశరథరామిరెడ్డి, మాధమాల నారాయణరెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు ఉన్నారు.



వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



దక్కిలి: వేణుగోపాల్‌ను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సాయికృష్ణ యాచేంద్రతో భేటీ

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరి రాజా ప్యాలెస్‌లో ఎస్వీబీసీ మాజీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్రతో భేటీ అయ్యారు. ఇద్దరూ సుమారు గంట పాటు స్థానిక రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు.